మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

ధాన్యానికి ట్యాగ్ చేసి మిల్లులకు పంపాలి

నిర్వాహకులదే పూర్తి బాధ్యత.. కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ విజయేంద్ర బోయి

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మహబూబ్‌నగర్ బ్యూరో,మే 1 ప్రభాతవార్త:ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు సంబంధించి ఆన్లైన్ ప్రొక్యుర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టం (ఓపిఎంఎస్)లో రైతుల వివరాలు వెంటనే నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు.గురువారం మహబూబ్‌నగర్ రూరల్‌మండలం కోటకద్ర ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం ద్వారా అప్పాయపల్లివద్ద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు తర్వాత మిల్లుకు పంపే వరకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకున్నారు. సరైన తేమ శాతం,నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లుకు పంపించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుకు కొనుగోలు వివరాలతో కూడిన కొనుగోలుపత్రం అందచేయాలన్నారు.కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యం మిల్లు కు రవాణా చేయుటకు అవసరమైన లారీలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన రైతుల వివరాలు వెంట వెంటనే వీశిలీళీ లో నమోదు చేసి రైతులకు చెల్లింపులు త్వరగా చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి శంకరా చారి,సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్,మహబూబ్ నగర్ రూరల్ తహశీల్దార్ సుందరా చారి, తదితరులు ఉన్నారు.

మృత్యువులో వీడని బంధం...

- **విద్యుదాఘాతంతో తల్లీ కొడుకుల మృతి**
- **మిన్నంటిన రోధనలు**

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త: నవమాసాలు మోసి పేగు తెంచుకొని పుట్టిన బిడ్డ కళ్ల ముందే కాటికి కాలు చాపడంతో ఆ బిడ్డను ఎలాగైనా కాపాడుకోవాలనే తపనతో తల్లి ముందడుగు వేసింది కానీ మృత్యువు తల్లి కొడుకులను విద్యుదాఘాత రూపంలో వచ్చి కబళించింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండలం తుమ్మలసూరు గ్రామంలో నిరుపేద కుటుంబం. కుటుంబ పోషణ కోసం గ్రామంలో పిండి గిర్నిని నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం తల్లికి బాసటగా నిలిచేందుకు కుమారుడు శ్రీకాంత్(15) పిండి గిర్ని నిర్వహణ చేస్తున్న సమయంలో అకస్మాత్తుగా పిండి గిర్నిలో విద్యుదాఘాతం చోటు చేసుకుంది. కొడుకుకు విద్యుదాఘాతం తగిలిన విషయం గమనించిన తల్లి జయమ్మ(40) కొడుకు శ్రీకాంత్‌ను కాపాడుకోవాలని శత విధాల ప్రయత్నం చేసినప్పటికి విఫలమైంది. విద్యుదాఘాతానికి గురై కొట్టుమిట్టాడుతున్న కన్న కొడుకును కాపాడుకోవాలనే ఆలోచనలో తాను కూడా విద్యుదాఘాతానికి బలైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. ఒకే సారి తల్లీకొడుకు మృతి చెందారనే విషయాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తట్టుకోలేక కంటతడి పెట్టారు. కుటుంబ సభ్యుల అర్థనాథలు మిన్నంటాయి. మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా మృతుల కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మహిళ దారుణ హత్య

నవాబుపేట,మే 1 ప్రభాతవార్త : మండల పరిధిలోని కాకర్జాల గ్రామ శివారులో యువతిని (23) దారుణ హత్య చేసి తానే హత్య చేసానని లొంగిపోయిన హంతకుడు. వివరాల్లోకి వెళితే కొల్లూరు గ్రామానికి చెందిన సాలె శ్రీరామ్ నరేష్ (30) యువకుడు జడ్చర్ల మండలం మల్లెబోయిన పల్లి గ్రామానికి చెందిన గీతాంజలిని నిర్మాణుష్య ప్రదేశానికి తీసుకెళ్లి కళ్ళలో కారం చల్లి కత్తితో పొడిచి చున్నీతో గొంతుకు ఉరేసి హత్య చేశాడు. అదే రాత్రి చేసి పోలీసులకు ఫోన్‌చేసి మరీ లొంగిపోయాడు. యువకునికి గతంలో పెళ్లి అయి ఒక పాప కూడా ఉందని భార్య ఇతనితో వేగలేక తను తల్లి గారి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. హంతకుడు జడ్చర్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశ్రమలలో పనిచేస్తూ మల్లెబోయిన పల్లి గ్రామానికి చెందిన గీతాంజలి అనే యువతితో పరిచయం పెంచుకున్నాడు. అప్పటికే పెళ్లి అయిన భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న గీతాంజలిపై ప్రస్తుతం ఈ ఘాతుకానికి ఒడిగట్టిన యువకుడికి దగ్గరైంది. దీంతో వారిరువురి సహజీవనం కారణంగా ఓ బాలిక జన్మించింది. ఆ తర్వాత ఇరువురి మధ్య కూడా మనస్పర్థలు వచ్చి తరచూ గొడవపడేవారని సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కత్తిపోటుకు గురైన యువతి

ఈత సరదాలో ముగ్గురు విద్యార్థులు బలి

మృతి చెందిన వేరు వేరు కుటుంబాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు.

కొల్లాపూర్, మే 1 ప్రభాతవార్త : ఈత సరదా రెండు కుటుంబాలలో విషాదం నింపిన సంఘటన వివరాలు నాగర్ కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ఉండే పోతినేని చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ముగ్గురు చిన్నారులు చెరువులో ఈతకు వెళ్ళి గల్లంతైన సమాచారం అందుకున్న అధికారులు చెరువు దగ్గరకు చేరుకుని స్థానికుల సహాయంతో ముగ్గురు చిన్నారుల మృతదేహాలు వెలికితీశారు. మృతి చెందిన చిన్నారులు గణేష్ రెడ్డి (13) రక్షిత (10)లు ఒకే కుటుంబానికి చెందిన అన్న, చెల్లెలు, ధర్మారెడ్డి పిల్లలు కాగా, వారి తల్లి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. కాగా, శ్రావణ్ (7) మరొక కుటుంబానికి చెందిన వాడిగా పోలీసులు గుర్తించారు. చిన్నారుల మృతదేహాలు చూసిన తల్లిదండ్రులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. అధిక ఎండలకు ముగ్గురు చిన్నారులు సరదాకి ఈతకు వెళ్లి మృతి చెందడంతో పెద్దకొత్తపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సాగునీటి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తాం

-సాగునీటి ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు

మంత్రి ఉత్తమ్‌కు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 01 ప్రభాతవార్త:పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసి తీరుతామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్ వద్ద పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్‌లతో కలిసి భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు పూర్తయ్యే దశలో ఉన్నప్పటికీ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం వహించడం వల్లే పనుల్లో జాప్యం జరిగిందన్నారు. గతంలో పాలమూరు ప్రాజెక్టు వద్ద ప్రారంభించిన మోటార్‌కు సంబంధించి విద్యుత్ ఏర్పాట్లు ఉన్న అడ్డంకులను తొలగిస్తూ విద్యుత్ శాఖ, ఇరిగేషన్ శాఖలకు రూ.262 కోట్లు చెల్లించి స్టేషన్ల వద్ద మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు అందించామన్నారు. నార్లాపూర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ప్రాజెక్టు వద్ద పంపింగ్ ప్రారంభిస్తామన్నారు. ప్రాజెక్టులకు అడ్డంకిగా మారిన భూసేకరణ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలను పూర్తిచేసుకొని పనులను వేగవంతంగా పూర్తి అయ్యేలా కృషి చేస్తామన్నారు. అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులను కేటాయిస్తామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో గతంలో పాడైన పంపులను రిపేరు చేయించి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను సందర్శించడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టులను ఈ ఆర్థిక సంవత్సరం మార్చ్ 2026 లోపు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వేనా ప్రాజెక్టులను పూర్తి చేసి 50 టీఎంసీల నీటిని నింపేందుకు 6 నెలల సమయాన్ని పెట్టుకొని ప్రణాళిక బద్ధంగా పనులు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నింపేందుకు వచ్చే ఏడాది మార్చి 2026 లోపు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అధికారులను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టులను సందర్శించేందుకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ప్రాజెక్టులు ముంపుకు గురైన రైతులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద తమకు పరిహారం చెల్లించాలని వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డిసిసిబి అధ్యక్షులు మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

నీట్ పరీక్షను పకడ్బంధీగా నిర్వహించాలి

పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలి

అభ్యర్థులు సూచనలను తు.చ తప్పకుండా పాటించాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

నీట్ పరీక్ష కేంద్రాలు

1. ఎంవిఎస్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల,మహబూబ్‌నగర్
2. పిఎం కేంద్రీయ విద్యాలయం,మహబూబ్‌నగర్
3. ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల,మహబూబ్‌నగర్
4. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మహబూబ్‌నగర్
5. ఎన్టీఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహబూబ్‌నగర్
6. యూనివర్సిటీ పీజీ కళాశాల, సైన్స్ బ్లాక్
7. డాక్టర్ బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్ల
8. తెలంగాణ మైనార్టీ బాలికల జూనియర్ రెసిడెన్షియల్ కళాశాల, భగీరథ కాలనీ మహబూబ్‌నగర్
9. ప్రభుత్వ బాలురాజ్ జూనియర్ కళాశాల, మహబూబ్‌నగర్
10. తెలంగాణ మైనార్టీ బాలుర జూనియర్ రెసిడెన్షియల్ కళాశాల,బికే రెడ్డి కాలనీ, మహబూబ్‌నగర్
11. ప్రభుత్వ మోడల్ బేసిక్ హై స్కూల్, మహబూబ్‌నగర్
12. ఎంజెపిటిబిసి డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్ , హన్వాడ
13. టిజిఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్, బాలికల జూనియర్ కళాశాల, జెపిఎన్సి కళాశాల దగ్గర, బొక్కలోని పల్లి మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 1 ప్రభాతవార్త: మే 4 న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్)అండర్ గ్రాడ్యుయేషన్ 2025 ప్రవేశ పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. నీట్ యూజీ 2025 ప్రవేశ పరీక్ష నిర్వహణ పై గురువారం కలెక్టర్ కార్యాలయంలో మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు,అబ్జర్వర్‌లు,వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. నీట్ 2025 ప్రవేశ పరీక్ష మే 4న మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, జిల్లాలో 4454 మంది అభ్యర్థులు నీట్ ప్రవేశ పరీక్ష రాయనున్నారని, ఇందుకుగాను మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో 13 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎం.వి.ఎస్. గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, పి ఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ,ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల,పాలమూరు యూనివర్సిటీ శిబి కాలేజ్ అండ్ అండ్ సైన్స్ బ్లాక్, డా. బి.ఆర్.ఆర్. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, గవర్నమెంట్ మోడల్ బేసిక్ హై స్కూల్, ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ. రెసిడెన్షియల్ స్కూల్(బాలికల), టి.జి.ఎస్.డబ్ల్యూ. రెసిడెన్షియల్ స్కూల్ మరియు గర్ల్స్ జూనియర్ రామి రెడ్డి గూడెం లలో ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. నీట్ పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని , అలాగే పరీక్ష నిర్వహించే రోజు పరీక్ష కేంద్రాల పరిధిలో పూర్తి బందోబస్తుండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలతో పాటు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలని,అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సౌకర్యాలు కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆమె ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ఎక్కడ ఎలాంటి తప్పు జరగకుండా పరీక్షలను సీరియస్ గా తీసుకొని నిర్వహించాలని అన్నారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందే వెళ్లి చూసుకోవాలని సూచించారు. అడ్మిట్ కార్డులో లొకేషన్ తో సహా ముద్రించడం జరుగుతుందని, అందువల్ల అభ్యర్థులు ఎలాంటి ఆందోళన లేకుండా పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకుని పరీక్షలను సవ్యంగా రాయాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఎస్పి వేంకటేశ్వర్లు, నీట్ పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ నరేందర్ సంబంధిత శాఖల అధికారులు, ఈ సమావేశానికి హాజరయ్యారు.

పాలమూరు రంగారెడ్డి రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేయాలి

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మొక్కను అందజేస్తున్న దృశ్యం

ఎదుల రిజర్వాయర్‌ను సందర్శిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, నాగర్ కర్నూల్ కలెక్టర్ బి.సంతోష్, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త : పాలమూరు రంగారెడ్డి రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లాలోని నార్లపూర్, వనపర్తి జిల్లాలోని ఎదుల ఫేజ్ 2 రిజర్వాయర్లను సందర్శించారు. మధ్యాహ్నం ఎదుల రిజర్వాయర్ వద్ద హెలికాప్టర్ ద్వారా చేరుకోగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మంత్రికి పూల బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నా రెడ్డి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బి. సంతోష్ , ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లతో కలిసి ఎదుల రిజర్వాయర్ ఫేజ్ 2ను పరిశీలించారు. అనంతరం ఎదుల టన్నెల్ ను సందర్శించి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇరిగేషన్ శాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

శ్రమ జీవుల కష్టంతోనే ఆనందం, ఆరోగ్యం

- **శ్రమ గొప్పదనాన్ని చాటి చెప్పే రోజే ఈ మేడే**
- **శ్రమను గౌరవిద్దాం కార్మికులకు అండగా ఉందాం**
- **కార్మిక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**
- **మేడే కానుకగా మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ, సహపంక్తి భోజనం**

కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, మే 1 ప్రభాతవార్త: మున్సిపాలిటీలలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు కార్మికులు ఎంతగానో శ్రమిస్తారని, వారి శ్రమతోనే ప్రజలందరికీ ఆనందం, ఆరోగ్యం సమకూరుతాయని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జడ్చర్ల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మేడే వేడుకలలో ఆయన పాల్గొని కార్మికులతో కలిసి భోజనం చేశారు. మేడే కానుకగా మున్సిపల్ కార్మికులందరికీ దుస్తులను పంపిణీ చేసారు. మున్సిపాలిటీలో గాని, గ్రామాలలో గాని పరిసరాల పరిశుభ్రత కోసం కార్మికులు అహర్నిశలు పాటు పడతారని ఆయన ప్రస్తావించారు. ఒక్కరోజు ఈ కార్మికులు పని చేయక పోయినా పరిసరాలన్నీ కంపు కొడతాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడతారని చెప్పారు. అందుకే వారు చేసే సేవలు అమూల్యమైనవని అభిప్రాయపడ్డారు. పట్టణాల్లో, గ్రామాల్లో పని చేసే ఈ కార్మికుల కృషివల్లే అందరికీ ఆరోగ్యం సమకూరుతుందని పేర్కొన్నారు. మురికి కాలువలను శుభ్రం చేస్తూ, చెత్త ఎత్తివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు కార్మికులు ఎంతో కష్టపడతారన్నారు. అలాంటి కార్మిక సోదరులతో కలిసి భోజనం చేయడం చాలా సంతోషంగా భావిస్తున్నానని అనిరుధ్ రెడ్డి చెప్పారు. కార్మిక సోదరులకు నా వంతుగా అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్ పర్సన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, మున్సిపల్ కమిషనర్, ఎఎంసి వైస్ చైర్మన్ రాజు గౌడ్, కౌన్సిలర్లు, ఎఎంసి డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం

కొండేరు స్టేజిలో హమాలి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

కొండేరు స్టేజిలో మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

ఇటిక్యాల, మే 1 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కర్షక కార్మికులను ఆదుకునేందుకు మంచి చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఐక్యమత్యంతో కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు నిరంతరం పోరాటాలు చేయాలని శ్రామికుల పోరాటాలు ఎన్నో గుర్తుకు వస్తున్నాయని ఖమ్మం జిల్లా ఇల్లెందు నియోజకవర్గ సిపిఐ పార్టీ నుండి 5 సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. గురువారం ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను పురస్కరించుకొని మండల పరిధిలోని కొండేరు స్టేజిలో హమాలీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్న కర్షక కార్మికుల జీవితాలలో వెలుగులు నింపేందుకు చట్టాలు చేయడం లేదని ప్రభుత్వాల పాలకులు కార్మిక చట్టాలపై మంచి చట్టాలు తీసుకొచ్చి కార్మికులకు మేలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం కొండేరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు పోతురాజు సోమనాద్రి ఆహ్వానం మేరకు -మిగతా4లో..

పాకిస్తాన్ ఉగ్రవాదుల వేటలో కూచూర్ సైనికులు

దేశం కోసం ప్రాణాలకైనా వెనకాడం : బార్డర్లో కూచూరు సైనికులు

బార్డర్లో ఉన్న కూచూర్ జవాన్లు

నవాబుపేట,మే 1 ప్రభాతవార్త : పాకిస్తాన్ ఉగ్రవాదుల వేటలో కూచూర్ గ్రామ ఆర్మీ సైనికులు ఉగ్రవాదుల ఏరివేతలో నిమగ్నమై ఉన్నారు. పగల్గాం దాడి ఘటనతో యావత్ భారతం కన్నీరు పెట్టుకుంది. ఆ కన్నీళ్లకు బదులు తీర్చుకోవాల్సిన అవసరం, బాధ్యత ఇప్పుడందరిపైనా ఉందని దీంతో ఉగ్రవాదంపై ఉక్కుపాదం అన్న రెయ్యులర్ మాటకు విరుద్ధంగా ఫుల్‌ఫోర్స్‌తో కదులుతోంది. ఉగ్రవాదుల ఏరివేతలో దేశంకోసం మా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నామని మన గ్రామానికి చెందిన భారత జవాన్లు ఈ తరు ణంలో ఏమి జరిగినా గర్వంగా స్వీకరిస్తామని,కూచూరు గ్రామానికి చెందిన భారత జవాన్ గడ్డం రాఘవేందర్ గ్రామస్తులకు చరవాణిలో తెలిపారు. భారత బలగం ఉగ్రవాదం అంతు తేలాలి. లెక్కకు లెక్క పక్కాగా అప్పచెప్పాలి. మరోసారి భారత్‌వైపు చూడాలంటే గజగజ వణికిపోవాలన్న రేంజ్‌లో దూసుకుపోతోంది. ఇండియన్ ఆర్మీ, బిఎస్ఎఫ్ సిఆర్పిఎఫ్‌తో కలిసి కసిగా అడుగులు వేస్తోంది. ఇక వేట మొదలైంది. ఆ రాత రాసిన భగవంతుడొచ్చినా ఆపలేడు అన్నట్లుగా ఉగ్రవా దుల ఏరివేత షురూ చేసామన్నారు. కూచూరు గ్రామ యువకులు దాదాపు 80 మంది మిలిటరీ ఫోర్సు బార్డర్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. అందుకు గ్రామం ప్రజలు గర్వంగా చెప్పుకుంటారు.

ఆ కంపెనీలకి కార్మిక చట్టాలు పట్టవా..?

మేడే రోజు దర్జాగా కంపెనీల నిర్వహణ

బాలానగర్, మే 1 ప్రభాతవార్త : కార్మికుల దినోత్సవం రోజు కూడా కార్మిక చట్టానికి వ్యతిరేకంగా కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. మమ్మల్ని అడిగేది ఎవరు అంటూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయి. బాలానగర్ మండల పరిధిలోని వివిధ పరిశ్రమలు కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మికులకి సెలవు ప్రకటించాలి. కానీ పలు కంపెనీలు కార్మిక చట్టాలు తుంగలో తొక్కి కార్మిక దినోత్సవం రోజు యదేచ్ఛగా కంపెనీలు యధావిధిగా నడిపించారు. గుండేడు పరిధిలోని ఐరన్ స్పాంజ్ కంపెనీలో ప్రశ్నించడానికి వెళ్లిన విలేకరులతో కంపెనీ జనరల్ మేనేజర్ దురుసుగా ప్రవర్తించారు. మేడే సందర్భంగా కూడా తమను పని చేయించారని పలువురు కార్మికులు అసహనాన్ని వ్యక్తపరిచారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మిక చట్టాలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఎమ్మెల్యే సహకారంతోనే ఉత్తమ ఫలితాలు

కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

మక్తల్,మే1 ప్రభాతవార్త: మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అన్ని విధాలుగా తోడ్పాటును అందించడం వల్లనే విద్యార్థులు ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించి మక్తల్ ప్రాంతానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించే సదుపాయాన్ని సమకూర్చడం జరిగిందన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను అప్రమత్తం చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మార్కులను సాధించడం గర్వకారణమని అన్నారు. పేద విద్యార్థుల కోసం స్థానిక ఎమ్మెల్యే భవిష్యత్తులోనూ మరింత సహకారం అందించనున్నారని వారన్నారు. సమావేశంలో నాయకులు కట్ట సురేష్, బోయ వెంకటేష్, ఫయాజ్, సురేష్, సాయి ఫైనాన్స్ శీను, నరసింహ, శేఖర్, లక్ష్మన్న, రాములు, అశోక్ గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ కిట్లు అందజేసిన శశిధర్ గౌడ్

కార్మికులను సన్మానించిన దృశ్యం

మూసాపేట్, మే 1 ప్రభాతవార్త : కార్మికుల దినోత్సవం సందర్భంగా జానంపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు శ్రీ మలేలా శశిధర్ గౌడ్, ముందుకు వచ్చి గ్రామ పారిశుధ్య కార్మికులకు (9) మందికి కొత్త బట్టలు, సేఫ్టీ కిట్‌లను అందించి వారిని శాలువాలతో సన్మానించడం జరిగింది. అనంతరం శశిధర్ గౌడ్ మాట్లాడుతూ మన గ్రామంలో పరిశుభ్రత గ్రామ పరిరక్షణ కోసం ఎల్లవేళలా ఎండనక వాననక నిరంతరం కష్టపడి గ్రామానికి తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారు. అలాంటి మన కార్మికులను వాళ్ళ సేఫ్టీ ఆలోచించడం మన గ్రామ యువకులది అని అన్నారు. కార్మికులను శాలువాలతో సన్మానించి అభినందించారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి కూడా సన్మానించారు. కార్మికులకు రోజు వారి పనిలో భాగంగా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని నోటికి మాస్కులు, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలనిని సూచించారు, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి మాధవి, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

శ్రీరామ జయరామలో రక్తదాన శిబిరం

రక్తదానం చేసినా కార్మికులను అభినందిస్తున్న డిఎస్పి

మహబూబ్‌నగర్ మే 1 ప్రభాతవార్త: సమాజంలోని ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణ దాతలుగా నిలవాలని మహబూబ్‌నగర్ డిఎస్పి పి.వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించే మేడే వేడుకలలో భాగంగా గురువారం మహబూబ్‌నగర్‌లోని మెట్టుగడ్డ వద్ద ఉన్న శ్రీ రామ జయ రామ సంస్థలో సిఈఓ సరసయ్య అధ్యక్షతన నిర్వహించిన మేడే వేడుకలకు డిఎస్పి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరామ జయ రామ యాజమాన్యం, ఉద్యోగులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి మేడే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌తో కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంపై శ్రీరామ జయ రామ యాజమాన్యాన్ని డి ఎస్ పి ప్రత్యేకంగా అభినందించారు. రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల ప్రాణాలను కాపాడేందుకు రక్తం అత్యవసరమన్నారు.మేడే సందర్భంగా రక్త దానం చేసిన ఉద్యోగులను అభినందించారు. 69 మంది ఉద్యోగులు రక్త దానం చేసి ఉదారతను చాటుకున్నారు.కాగా రక్త దానం చేసిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర, జిల్లా ఎంసీ మెంబర్లు రమణయ్య, తిరుపతి రెడ్డి, జూనియర్ రెడ్ క్రాస్ సమన్వయ కర్త లు లయన్ అశ్విని చంద్రశేఖర్, కందుకూరి అశోక్ కుమార్, శ్రీరామ జయ రామ సంస్థ సిఈఓయం.సరసయ్య, ఆయా విభాగాల బాధ్యులు వేణుగోపాల్ రెడ్డి, ఎస్.రామకృష్ణ, రాందాస్ యాదవ్, నవీన్ పాల్గొన్నారు.

జిల్లాటాపర్‌ను అభినందించిన కలెక్టర్

నవాబుపేట,మే1 ప్రభాతవార్త: మండల పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి సాయి చరణ్ తేజ్‌ను జిల్లా స్థాయి ర్యాంకు అత్యధిక మార్కులు 579 సాధించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తుందని నిరూపించిన కొల్లూరు పాఠశాలలో చదువుతున్న కేశవరావు పల్లి గ్రామానికి చెందిన సాయి చరణ్ తేజను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి తన చాంబర్లో శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కలెక్టర్ ఫ్యూచర్లో ఏమవుతావని అడగగా కలెక్టర్ కావాలని తన కోరికని చెప్పడంతో కలెక్టర్ మరీ మరీ అభినందించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో అందించే నాణ్యమైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు బోధించే సిబ్బంది ఉంటారని ప్రజలు ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలని చదివించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్, ఏఎంఒ దుంకుడు శ్రీనివాస్, కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

సిపిఐ,ఏఐటియుసి ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు

సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయంలో మేడే ఉత్సవాలు

మేడే వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

జెండాను ఆవిష్కరిస్తున్న ఆర్.రామన్ గౌడు

వనపర్తి క్రైమ్, మే 1 ప్రభాతవార్త : వనపర్తి జిల్లా కేంద్రంలో సిపిఐ ఏఐటియుసీ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. సిపిఐ కార్యాలయం దగ్గర జిల్లా కార్యదర్శి విజయరాములు, ఎంసిహెచ్ వద్ద అధ్యక్షుడు శ్రీనివాసులు, మెడికల్ కాలేజీ వద్ద ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఫుట్ స్నేహ ఫుట్ పాత్ సెంటర్ వద్ద ఏఐటీయూసీ నాయకులు శాంతన్న, కర్రెమ్మ గుడి వద్ద సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, శ్రీనివాసపురం రోడ్డులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వి నాదం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యూనియన్ అధ్యక్షుడు గంధం శీను, మెడికల్ కాలేజ్ వద్ద ప్రిన్సిపల్ కిరణ్మయి ఎంసిహెచ్ దగ్గర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పతాకాలను ఆవిష్కరించారు. కేకులు కట్ చేసి మేడే ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి పోరాటాలతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పని దినం 8 గంటలకు 12 గంటలకు పెంచిందన్నారు. సంగం పెట్టుకునే హక్కు సమ్మె హక్కు హరించిందన్నారు. కష్టజీవుల శ్రమను దోచి సంపన్నులకు పెడుతోందన్నారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా విభజించి నిర్వీర్యం చేసిందన్నారు. వాటిని పునరుద్ధరించే దాకా పోరాడాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, చిన్న కురుమన్న, గంధం శీను, పృథ్వి నాదం, వరుణ్, జయమ్మ, శిరీష, జ్యోతి, బాలరాజు, వెంకటమ్మ, రమణ,రాంబాబు,పల్లె స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లి గ్రామంలో ఘనంగా మేడే వేడుకలు

కోయిలకొండ, మే 1 ప్రభాతవార్త : మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గురువారం గ్రామ ప్రజలు మేడే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కార్మికులు సాయిలు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు పని దినాలు కల్పిస్తూ వారికి సరిపడా జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మేడే సందర్భంగా జెండాను ఎగరవేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్మికులు కర్రోళ్ల సాయిలు, ఉప్పరి వెంకటయ్య, ఉప్పరి కనకప్ప, ఉడతల శ్రీను, మల్టీ పర్పస్ వెంకటయ్య, మల్టిపర్పస్ వెంకటేష్, శ్రీకాంత్, వడ్డే నారాయణ, బండి వెంకటయ్య, వడ్ల శ్రీనివాసులు, కావాలి రాజు, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు..!

వనపర్తి క్రైమ్, మే 1 ప్రభాతవార్త : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని గురువారం టిఎస్ యుటిఎఫ్ వనపర్తి జిల్లా కార్యాలయంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఆర్. రామన్ గౌడు యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రవిప్రసాద్ గౌడ్, డి.కృష్ణయ్య మాట్లాడుతూ రోజుకు 14 గంటలకు బదులుగా, ఎనిమిది గంటల పనివిధానం కావాలని, పనికి తగ్గ వేతనాలు కావాలని ప్రపంచవ్యాప్తంగా కార్మికులు పోరాటం చేశారని, చికాగో నగరంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో నేలకొరిగిన కార్మికులు రక్తంలో పుట్టిందే ఎర్రజెండా అని అన్నారు. మేడేను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు కోల్పోతున్న హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్, హమీద్, చిరంజీవి, సూరయ్య, ఎస్.వెంకటయ్య, డి.రాముడు, జి.కృష్ణ సి.రమేష్, బి.రాము తదితరులు పాల్గొన్నారు

కార్మికుల హక్కులకై పోరాడుదాం

చిన్న చింతకుంట, మే 1 ప్రభాతవార్త: వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కులకై పోరాడాలని కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మేడే సందర్భంగా టియు సిఐ, టిఫ్‌టియు యూనియన్లు వేరువేరుగా మండల కేంద్రంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారి వారి యూనియన్ జెండాలను ఎగురవేశారు. టియుసిఐ జిల్లా అధ్యక్షులు దేవదానం, టిఎఫ్టియు జిల్లా కార్యదర్శి యాదగిరిలు వేరువేరుగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని,నేడు పరిశ్రమలు నడవాలంటే కార్మికుల చెమట చుక్కలే ప్రగతి రథాలని అలాంటి కార్మికులకు వారి చట్టాలను అమలు చేయకుండా ద్రోహం చేస్తున్నారని వారు తెలిపారు. పనికి తగ్గ వేతనం అందించాలని వారి డిమాండ్ చేశారు. ఉద్యాల లాల్ కోట గ్రామాలలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు సాంబశివుడు, కోళ్ల వెంకటన్న, చంద్రన్న, ఆర్ఆర్ మన్యం, కొండన్న, బీడీ కార్మికులు ప్రేమన్న, బాలరాజ్, రేణుక కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే..

మక్తల్, మే 1 ప్రభాతవార్త: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం మక్తల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టియూసిఐ, సిఐటియూ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కార్మికులతో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించి, ఆయా సంఘాల జెండాలను ఎగురవేశారు. విశ్రాంత పిఈటి బి. గోపాలం ఆధ్వర్యంలో దాదాపు 100మంది మున్సిపల్ కార్మికులు, హమాలీలను శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, నాయకులు కిరణ్, గోవింద రాజు, కొల్మి రాములు, కర్రెం కృష్ణ, కార్మికులు కిష్టయ్య, రాజు, శంశుద్దీన్, అనిల్, మూర్తి, వెంకట గిరి, కుర్మయ్య, ఆశన్న, నరసింహ, శంకరమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు

ఇటిక్యాల, మే 1 ప్రభాతవార్త : కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ఐక్యమత్యంతో శ్రామికులు పోరాడాలని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని కొండేరు స్టేజిలో 139వ అంతర్జాతీయ మేడే దినోత్సవం పురస్కరించుకొని ఏఐటియుసి హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గ్రామ వివిధ పార్టీల నాయకులు కార్మికులతో కలసి మేడే జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాటాల వల్లనే 8 గంటల పని దినాలను సాధించుకోవడం జరిగిందని అమెరికా చికాకు నగరంలో 1886 మే 1న సమ్మె ఆనాటి పాలకులు కుట్రలు కుతంత్రాలు హింసాత్మక ఘటన వలన పోలీసు కాల్పుల్లో నలుగురు కార్మికులు మృతి చెందడం జరిగిందన్నారు. అనేకమంది కార్మికులు రక్తం చిందించారన్నారని 18గంటల పనిని పోరాటాల ద్వారా 8 గంటల పని దినాలను కార్మిక హక్కులను సాధించుకోవడం జరిగిందని పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను చట్టాలను కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈ 10 సంవత్సరాల కాలంలో హక్కులను కాలరాస్తూ యాజమానులకు పెట్టుబడుదారులకు 29 కార్మిక చట్టాలను రద్దుచేస్తూ 4 లేబర్ కోడ్లను పార్లమెంట్లో చట్టాలను తయారు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా యాజమాన్యాల చేతుల్లో బంధీలుగా చేస్తూ తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా 2025 మే 20 న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులందరూ పాల్గొని విజయంతం చేయాలని. మన హక్కులకోసం మేడే స్ఫూర్తితో పోరాటాన్ని సాగించాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి జి రంగన్న, గ్రామ సర్పంచులు వివిధ పార్టీల నేతలు సోమనాద్రి,హమాలీ సంఘం నాయకులు కుర్మన్న అనివేశ్, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

మున్సిపల్ సిబ్బందిని సన్మానించిన దృశ్యం

జెండాను ఆవిష్కరించిన ఏఐటీయూ సి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఎమ్మెల్యే కృషి

విర్కో ఫౌండేషన్ ద్వారా రూ. 1.65 లక్షల చెక్ అందజేసిన ఎమ్మెల్యే

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్, మే 1 ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి కృషి అమోఘమని.. క్రీడాకారులను చైతన్యపరిచేందుకు విర్కో ఫౌండేషన్ ద్వారా రూ 1.65 లక్షల రూపాయల చెక్కును గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేసినట్లు క్రీడాకారుడు, రాజాపూర్ మండలం ఇదిగానిపల్లి గ్రామానికి చెందిన రామని అశోక్ తెలిపారు. నివాస్ స్పోర్ట్స్ క్లబ్ హైదరాబాద్ లో శిక్షణ పొందుతున్న రామని అశోక్ సహాయం చేయాలని ఇదిగానిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను సంప్రదించగా వారు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఎమ్మెల్యే స్పందిస్తూ విర్కో ఫౌండేషన్ ద్వారా రూ 1.65 లక్షలు సమకూర్చినట్లు తెలిపారు. తాము అడగగానే క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సహాయం అందజేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ఈ సందర్భంగా రామని అశోక్‌తో పాటు అతని తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పంచాక్షరి, ఇదిగానిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ఏర్పుల జంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, పీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కావలి శివకుమార్, ఇదిగానిపల్లి గ్రామ బీసీ సెల్ గ్రామ అధ్యక్షులు కుమ్మరి రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఏర్పుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్‌కు ఘన సన్మానం

ఉపాధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మహబూబ్ నగర్, మే 1 ప్రభాతవార్త : మహబూబ్ నగర్ జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షుడు మక్సూద్దీన్ అహ్మద్ జాకీర్ అడ్వకేట్‌కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ చైర్మన్గా మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ నియమించిన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం మైదానంలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా ఒలంపిక్స్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి వెంకటేష్ మాట్లాడుతూ ఆయన జిల్లా బాస్కెట్ బాల్ కు చేసిన కృషి సేవలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ సంఘం చైర్మన్‌గా ఎంపిక కావడం చాలా సంతోషమైన విషయమని తెలిపారు. జిల్లా క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. మరిన్ని పదవులను సాధించి జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా మార్కెట్ చైర్ పర్సన్ బి.సునీత, డివైఎస్ఓ శ్రీనివాస్, మహబూబ్‌నగర్ వివిధ క్రీడల అధ్యక్ష కార్యదర్శులు బాల రాజయ్య, దామోదర్ రెడ్డి, వాడేన్న, జగన్మోహన్ గౌడ్, వేణుగోపాల్, రజినీకాంత్, మీరు హర్షద్ అలీ, కురుమూర్తి గౌడ్, మహమ్మద్ జియాఉద్దీన్, సయ్యద్ షరీఫ్ అలీ, శ్రీను, మహమ్మద్ ఇలియాస్, కె.సుభాన్ జి, ఫారూక్ మొకరం, వై.శ్రీకాంత్, సునీల్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే పరమావధిగా కెసిఆర్ పాలన

గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, రమేష్ గౌడ్

జెండాను ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

వనపర్తి క్రైమ్, మే 1 ప్రభాతవార్త : కార్మికుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యములో స్థానిక రాజీవ్ చౌరస్తాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. పట్టణములో బిఆర్యస్ కార్మిక విభాగాలు అయిన హమాలీ,ఆటో,తోపుడు బండ్ల,చాటకూలి,దడవాయి,మత్స్ కార్మిక,నాయిబ్రహ్మణ, ఆర్‌టిసి కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేశాయి. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ పి.రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి,ఉంగ్లం. తిరుమల్ తదితరులు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ, నిరంజన్ రెడ్డి,రావుల చంద్రశేఖర్‌రెడ్డి అనుక్షణం కార్మిక సంక్షేమం కోసం తపించేవారని వారికి కమ్యూనిటీ హాల్స్, వ్యక్తిగత అవసరాలు తీర్చారని అందుకే అధికారం లేకపోయినా కార్మికులు అండగా నిలిచారని అన్నారు. రాబోవు కాలములో మళ్ళీ కెసిఆర్ నిరంజన్‌రెడ్డి అధికారంలోకి రావడం ఖాయమని కార్మికుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. అన్ని కార్మిక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతృనాయక్, బండారు కృష్ణ, డ్యానియల్, ఇమ్రాన్, సూర్యవంశం గిరి, జోహెబ్ హుస్సేన్,సయ్యద్, జెమీల్, నందిమల్ల రమేష్, సునీల్ వాల్మీకి,ఎ.కే.పాషా, హారిఫ్, జె.శ్రీనివాసులు,పెద్ద ముక్కల.రవి, నీలస్వామి,కార్మిక సంఘాల నాయకులు రాములు,చంద్రయ్య, బోలెమోని కృష్ణయ్య, అశ్విని కుమార్, తాత రాములు,యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం

డిఐఈఓ ఎర్ర అంజయ్య

వనపర్తి క్రైమ్,మే 1 ప్రభాతవార్త : ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను గురువారం విడు దల చేశారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఇంటర్మీడి యట్‌లో ప్రవేశం పొందుటకు అడ్మిషన్ల మొదటి విడత ప్రక్రియ మే 1వ తారీఖు నుండి ప్రారంభం అయి జూన్ 30న ముగుస్తుం ది. జూన్ 2 నుండి కళాశాలలు పున: ప్రారంభం అవుతాయి. అదే రోజు నుండి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించబడును. కళాశాలలో చేరే విద్యార్థులు ఇంటర్నెట్ మె మోతో అడ్మిషన్ పొందవచ్చు అని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్రఅంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

పది ఫలితాలలో గురుకుల విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డీఈఓ రమేష్‌కుమార్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 550 మార్కులు పైగా సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు చెందిన 27 మంది విద్యార్థులను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, డీఈఓ రమేష్‌కుమార్‌లు గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు త్వరలోనే ట్యాబులు అందజేస్తామని కలెక్టర్ వెల్లడించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల ఆశయాలను సహకారం చేయాలని సూచించారు. ఉన్నత విద్యకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానని కలెక్టర్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 96.83 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 13వ స్థానం నిలబెట్టినందుకు కలెక్టర్ విద్యాశాఖను, ప్రధాన ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల జీవితంలో తొలిమెట్టు అని అత్యుత్తమ ప్రతిభతో అధిరోహించడం సంతోషించదగ్గ విషయమని, రానున్న ఉన్నత విద్యాను కూడా అధిరోహించాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినీలు తమ జీవిత లక్ష్యాలను సాధించడానికి అనువైన అవసరమైన సమకూర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, నోడల్ అధికారి కుర్మయ్య, సెక్టోరియల్ అధికారులు షర్బుద్దీన్, వెంకటయ్య, ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లికి ఆర్థిక చేయూత

ఆర్థిక సాయం అందజేసిన దృశ్యం

రాజాపూర్, మే 1 ప్రభాతవార్త : రాజాపూర్ మండలం సింగమ్మగూడ తాండ గ్రామపంచాయతీలో సభావత్ వాల్సింగ్ కూతురు స్వాతి వివాహానికి రూ. 10,000లను కాంగ్రెస్ పార్టీ యువనేత రాఘవేందర్ నాయక్ ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ ఉప అధ్యక్షులు వెంకట్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు గణేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు రాధాకృష్ణ నాయక్, ఫూల్య నాయక్, దర్గన్న నాయక్, శివకుమార్ నాయక్, గోవింద్ నాయక్, దేవ్య నాయక్, రాంచందర్ నాయక్, తరుణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు

నారాయణపేట టౌన్, మే1 ప్రభాతవార్త: మత్తు పదార్థాల నిర్మూలన, అక్రమ రవాణా జరగకుండా గురించి పోలీస్ జాగిలాలతో గురువారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా కిరాణా షాపులలో, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో, పన్ షాప్ లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డామర గిద్ద పిసి సురేందర్, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మార్కెట్ చైర్మన్

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న దృశ్యం

అయిజ, మే 1 ప్రభాతవార్త : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన బోయ సోమన్నకి 60 వేల రూపాయలు, కుమ్మరి శాంతికుమార్‌కి రూ.60 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఈ చెక్కులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏక్లాస్ పురం ఆంజనేయులు, బసవరాజు ,మద్దిలేటి, దేవరాజ్, మహేందర్, దేవేందర్, లక్ష్మన్న నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

నారాయణపేట టౌన్, మే1 ప్రభాతవార్త : వేసవికాలం దృశ్య వివిధ గ్రామాల నుంచి పట్టణానికి వస్తున్న ప్రజలు, కార్మికుల, దాహాన్ని తీర్చేందుకు నారాయణపేట జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో గురు వారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో చలివేంద్రాన్ని కార్మికశాఖ జిల్లా అధికారి మహేష్ కుమార్ ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కార్మిక శాఖ అధికారి మహేష్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల అడ్డలో కార్మికులకు త్రాగునీటి వసతికల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ సూచనమేరకు కార్మిక శాఖ ఆధ్వర్యములో నేడు చలివేంద్రం ప్రారంభించడం జరిగిందని అన్నారు.ఎండల తీవ్రత పెరుగుతున్నందు వల్ల కార్మిక శాఖ ఈ నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. మే నెల మొత్తం చలివేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కార్మికశాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ తిలక్ కంప్యూటర్ ఆపరేటర్ కవిత పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో భూత్పూర్‌లో బాలికలదే పైచేయి

భూత్పూర్,మే 1,ప్రభాతవార్త: టెన్త్ ఫలితాల్లో భూత్పూర్ మండలంలో బాలికలే టాప్‌గా నిలిచారు.భూత్పూర్ మండలంలోని 11 ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్,ప్రైవేట్ న్యూ ఎరా టాలెంట్ హైస్కూల్‌లో మొత్తం 472మంది విద్యార్థిని విద్యార్థులకుగాను 429మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 11ప్రభుత్వ జెడ్పీ హైస్కూళ్లలో 420 విద్యార్థులకుగాను 377మంది ఉత్తీర్ణతతో 90 శాతం ఉత్తీర్ణత సాధించగా,ప్రైవేట్ పాఠశాల న్యూ ఎరా హైస్కూల్‌లో 52మందికిగాను 52మంది ఉత్తీర్ణత సాధించి వందశాతం రిజల్ట్ సాధించారు.మండలం మొత్తంలో బాలికలే టాప్‌గా నిలిచారు.579మార్కులతో భూత్పూర్ ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన శ్రేయరెడ్డి ప్రథమస్థానంలో నిలిచారు.549మార్కులతో కొత్తమొల్గర జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన బష రాబేగం,544మార్కులతో కేజీబీవీ భూత్పూర్‌కు చెందిన పి పల్లవి,542మార్కులతో తాటిపర్తి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సుచిత్ర,533మార్కులతో జెడ్పీహెచ్ఎస్ భూత్పూర్‌కు చెందిన గొడుగు గౌతమిలు టాపర్లుగా నిలిచారు.ఇక ప్రైవేట్ పాఠశాల న్యూ ఎరా నుంచి 572 మార్కులతో కె ప్రణయ మండలంలోనే ద్వితీయ స్థానంలో నిలిచారు.

మిల్లర్లు ధాన్యం అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయాలి

సన్న వడ్లతో పాటు మిల్లరు 5 వేల బస్తాల దొడ్డు వడ్లు విధిగా దించుకోవాలి : అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు

మిల్లర్లు అసోసియేషన్ సభ్యులతో సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వనపర్తి, మే 1 ప్రభాతవార్త: సన్న వడ్లతో పాటు ప్రతి మిల్లరు 5 వేల బస్తాల దొడ్డు వడ్లు విధిగా దించుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో మిల్లర్లు మిల్లు అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సీజన్లో సన్నవడ్లతో పాటు కొంతమంది రైతులు దొడ్డువడ్లు సైతం పండించారని ఇది దాదాపు జిల్లాలో దాదాపు1.40 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందన్నారు. అందువల్ల సన్న వడ్లతో పాటు ప్రతి మిల్లు 5000 బస్తాల దొడ్డు రకం వడ్లు తీసుకోవాలని సూచించారు. లేని పక్షంలో నిబంధనల ప్రకారం చర్యలుఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు 60 శాతం దొడ్డు రకం, 40 శాతం సన్న రకం వడ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మిల్లర్లు తమ మిల్లుకు వచ్చిన ధాన్యాం లోడ్‌ను త్వరగా దించుకొని లారీలను తిరిగి పంపిం చాలని ఆదేశించారు. ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. డిఫాల్ట్ అయి ఉన్న మిల్లర్లు 25 బ్యాంక్ గ్యారంటీ అఫిడబిట్ విధిగా ఇవ్వాలని అదేవిధంగా డిఫాల్ట్ లేని మిల్లర్లు 10 శాతం బ్యాంకు గ్యారంటీ కచ్చితంగా ఇవ్వాలని సూచించారు. గత సీజన్ సంబంధించి సీఎంఆర్ రైసు ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేయాలని ఇప్పటివరకు జిల్లా నుంచి 56శాతం పూర్తికాగా ఇంకా 44 శాతం ఇవ్వాల్సి ఉందని తెలియజేశారు.జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్ డిఎం జగన్మోహన్, మిల్లర్ అసోసియేషన్ సభ్యులు, మిల్లు యజమానులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం

■ **రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి : బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాచాల బృందం

వనపర్తి క్రైమ్, మే 1 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు విఫలం అయ్యారని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఆరోపించారు. గురువారం గోపాలపేట మండలం బుద్దారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ గొడును వెలిబుచ్చారు. అనంతరం రాచాల మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి పక్షం రోజులు కావస్తున్నా అధికారులు తూకాలు చేయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పక్క మేఘాలు కమ్ముకుంటూ ఈదురు గాలులు వీస్తూ ఆకాల వర్షాలు కురవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సందర్భంగా నాయకులు రైతే రాజు. రైతు లేనిదే రాజ్యం లేదని. ఉపన్యాసాలు ఇస్తున్నట్లుగా అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేటప్పుడు అధికారులు ప్రతీ గింజ కొంటామని చెబుతుంటారని, కానీ అమలైనా దాఖలాలు లేవన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని, గన్నీ బ్యాగుల కొరత ఉందని, కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేని దుస్థితిలో అధికారులు ఉన్నారని, కేంద్రాలను అధికారులు పరిశీలించిన సంఘటనలే లేవన్నారు. డీఎస్ఓ నిర్లక్ష్యం కారణంగానే ధాన్యం కొనుగోలు జరగడం లేదని, దీనిపై కలెక్టర్ కలుగజేసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గోటూరి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుకు రేనట్ల మల్లేష్, ఆర్టిఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, పెద్దమందడి మండల అధ్యక్షుడు రమేష్ సాగర్, స్థానిక రైతులు రాములు, సత్యంగౌడ్, గురవయ్య, లక్ష్మి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్లు జైలు శిక్ష

■ **శిక్ష పాటు 25 వేల రూపాయలు జరిమాన**

■ **నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు తప్పవు**

■ **వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

■ **నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించిన ఎస్పీ**

పోలీసుల అదుపులో నిందితుడు

వనపర్తి క్రైమ్, మే1 ప్రభాతవార్త : రాత్రి ఇంటి ముందర నిద్రించే సమయంలో మైనర్ బాలికను ఎత్తుకెళ్లి నోట్లో గుడ్డను కుక్కి అత్యా చారం చేసిన కేసులో నేరం రుజువవడంతో నేరస్తునికి 20 సంవత్సరాలు కఠిన కారాగార జైలు శిక్షతో పాటు 25 వేల రూపాయలు జరిమానా విధించిన వనపర్తి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత గురువారం నాడు తీర్పు ఇవ్వడం జరిగిందని జిల్లా రావుల గిరిధర్ తెలిపారు. కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ కొత్తకోట పోలీస్టేషన్ పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సమీప బంధువు చిన్నన్నాన్నమ్మ చనిపోవడంతో దిన కార్యాలలో పాల్గొనేందుకు పాఠశాల నుండి వచ్చిన మైనర్ బాలికపై అదే సంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జి. చెన్నయ్య అనే వ్యక్తి ఒంటరిగా పడుకున్న అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడ్డాడు.బాధితురాలుగ్రామానికి చెందినప్పటికీ కుటుంబ ఆర్థిక ఇబ్బందుల కారణంగా మదనాపురం మండల కేంద్రంలోని అమ్మమ్మ ఇంటి దగ్గర ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతుండేది. ఈ సంఘటన ఫిర్యాదు దారు 18052021 రాత్రి ఒంటరిగా పండుకున్న మైనర్ బాలికపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు కొత్తకోట పోలీ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి కొత్తకోట ఎస్సై, నాగశేఖర్ రెడ్డి, కేసు నమోదు చేయగాఅప్పటి సీఐ,మల్లికార్జున్‌రెడ్డి ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు. బాలిక ఫిర్యాదు మేరకు సంఘటన జరిగిన ప్రాంతంలో ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు సేకరించి చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు దిన కార్యాలను కానాయిపల్లి శివారులోని శివాలయంలో శివాలయంలో నిద్ర చేయుటకు వెళ్లారు అదే రోజు రాత్రి భోజనం చేసిన అమ్మాయి అత్త, మామ బాబాయిలతో కలిసి ఇంటి ముందు పడుకున్నారు. వారిని గుర్తించిన నేరస్తుడు చెన్నయ్య నిద్రపోతున్న అమ్మాయి దగ్గరికి వెళ్లి నోట్లో చున్నీ కుక్కి బలవంతంగా అక్కడనుండి తమ ఇంట్లోకి ఎత్తుకెళ్లి శారీరకంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. నిద్రలో మేల్కొన్న మా మామ అత్త ఇరువురు లేచి అమ్మాయి కోసం వెతుకుతుండగా నేరస్థుడు భయంతో వదిలి పెట్టి పారిపోయాడు ఇది గుర్తించిన చుట్టు ప్రక్కన వారు తమ సమీప బంధువులు పోలీసులకు సంఘటనకు సంబంధించిన వివరాలనుపోలీసులకు తెలియజేశారు. దీనిలో భాగంగా సాంకేతికంగా అవసరమైన ఆధారాలను సేకరించి నివేదికను తయారు చేసి. అప్పటి ఇన్వెస్టిగేషన్ అధికారి సీఐ మల్లికార్జున్ రెడ్డి, ఈ సంఘటనపై అప్పటి మొదటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కేసు నమోదు చేసిపైన పేర్కొనబడిన నిందితులను రిమాండ్కు తరలిం చి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు ప్రస్తుత సీఐ, రాంబాబు ,ఎస్సై, ఆనంద్, వనపర్తి కోర్టు లైజనింగ్ అధికారి, కె, సత్యం, హెడ్ కానిస్టేబుల్, జి.మన్యం కొండ కోర్టు కానిస్టేబుల్, ఆధ్వర్యంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శ్రీనివాసచారి వాదించారు.కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వాదనలు వినిపించగా నేరస్తునిపై నేరం నిరూపణ అయినందున గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తీర్పువెలువరించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నేరస్తులకుశిక్ష పడడంలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను,కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీఅభినందించి త్వరలోరివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

కార్మికుల సేవలు ప్రశంసనీయం

◆ **వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

మేడే సందర్భంగా కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే1 ప్రభాతవార్త: దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో లక్షలాది మందికి నిరంతరాయంగా సేవలం దిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు ప్రశంసనీయమని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మేడే కార్మిక దినోత్సవ సందర్భంగా గురువారం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులనుశాలువాలతో సన్మానించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలోని కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే వనపర్తి జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సిబ్బంది కొరత తీర్చేందుకు కొత్త నియమకాలను చేపడతామని, మున్సిపల్ చట్టం ప్రకారం కార్మికులకు అందించే ప్రతి బెనిఫిట్‌ను అందేలా చూస్తామని అన్నారు. అనంతరం వనపర్తి పట్టణం బసవన్నగడ్డలో లైట్ మోటార్ వెహికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆటో యూనియన్, ట్రాక్టర్స్ యూనియన్, కార్మికులకు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్,కార్యాలయ సిబ్బంది, వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ కౌన్సిలర్లు, లైట్ మరియు హెవీ వెహికల్స్ సంఘం అధ్యక్షులు అయూబ్ ఖాన్, కార్మికులు పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

◆ **ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగసభలు నిషేధం**

◆ **వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**

వనపర్తి క్రైమ్, మే1 ప్రభాతవార్త: శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా వనపర్తి జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ ఈ నెల, మే 01 నుండి 31 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు,ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్‌హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, రాజకీయ నాయకుల, కుల మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలి పారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించి నట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మృతి చెందిన మంగళి రమేష్ (ఫైల్)

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం సిర్సవాడ గ్రామంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సిరసవాడ గ్రామానికి చెందిన మంగలి రమేష్ (30) అదే గ్రామంలో తన కులవృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మంగళి రమేష్ తల్లిదండ్రులు గతంలోనే చనిపోవడంతో తన నాయనమ్మ రామలక్ష్మమ్మ దగ్గర ఉంటున్నాడు. గురువారం ఉదయం రమేష్‌ను నిద్ర లేపడానికి వెళ్లి తలుపులు కొట్టగా రమేష్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అతని నాయనమ్మకు ఇంటి గది కిటికీలో నుంచి చూడగా చున్నీతో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. అది చూసిన నాయనమ్మ తన మనవడు మృతి చెందినట్లు గుర్తించి బోరున విలపించడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.మృతి చెందిన రమేష్ ఒంటిపై రక్తపు మరకలు, గాయాలు ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకునే క్రమంలో తగిలిన గాయాలా లేక వేరే ఏమైనా గాయాలా అనే విషయాలు పోలీసు విచారణలో తెలియాల్సి ఉంది. మృతుడి తండ్రికి రెండో భార్య కూడా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీరి మధ్య ఆస్తి తగాదాలుఉండడం వల్ల ఇతని మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నానమ్మ రామలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడూరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

బీసీ కుల సంఘాలు, బిజెపి ఆధ్వర్యంలో

ప్రధాని నరేంద్ర మోడీకి పుష్పాభిషేకం

పుష్పాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

కల్వకుర్తి, మే 01 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయడం భారతదేశంలోని ప్రతి ఒక్క కులానికి కూడా లాభం చేకూరుతుందని మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారీ చిత్రపటానికి నిర్వహించిన పుష్పాభిషేకం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ తల్లోజు ఆచారి హాజరై బీసీ సంఘాలు, అన్ని కుల సంఘాలు, బిజెపి పార్టీ సభ్యులతో కలిసి ఆచారి పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లోజు ఆచారి మాట్లాడుతూ బీసీ కులగణన ద్వారా సమన్యాయం జరుగుతుందని, దాదాపు శతాబ్దం తర్వాత బీసీల కులగణన చేయడం ద్వారా న్యాయం జరగబోతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన బిసి సబ్ ప్లాన్ సాధన సమితి నాయకులు మేకల రాజేందర్, సదానందం గౌడ్, టి గోపాల్,పుట్టోజు రమేష్ బాబు, శ్రీనివాసాచారి, సోమోజి, గన్నోజు వేణుగోపాల్ చారిలు మాట్లాడుతూ బీసీలకు న్యాయం చేయాలని స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్లకు ఒక ప్రధానమంత్రి సంకల్పించడం చాలా గొప్ప విషయమని, బిజెపి పార్టీ చరిత్రలో నిలిచిపోయే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈసందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.బీసీ సంఘం నాయకులు అన్ని కులాల నాయకులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడుదాం

-సిపిఐ జిల్లా నాయకులు పులిజాల పరశురాములు

సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్వకుర్తి, మే 01 ప్రభాతవార్త: కల్వకుర్తి పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో గురువారం ఉదయం మేడే సందర్భంగా సిపిఐ జెండాను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పులిజాల పరశురాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికుల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలనీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కోటి 20లక్షల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని వారందరికి ఉద్యోగ భద్రత కల్పించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం 7కోట్ల కార్మికులకు మాత్రమే ఉద్యోగ భద్రత, తగిన వేతనాలతో జీవిస్తున్నారనీ, మిగతావారు బతుకు భ

దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దు

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బిజినేపల్లి, మే 1 ప్రభాతవార్త : రైతన్నలకు అండగా ఉండి ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తుందని దళారులకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. ఖానాపూర్ గ్రామంలో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ నాయినోళ్ల బాల్ రాజుగౌడ్‌తోపాటు ప్రారంభించారు . దళారులకు ధాన్యాన్ని విక్రయించి తూకాల్లో, చెల్లింపుల్లో మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం వరికి కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని అన్నారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తే సకాలంలో నగదు చెల్లించక పోవడంతో పాటు తూకాల్లో మోసం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రభుత్వం ఐకేపీ, పిఏసిఎస్ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే నగదు నేరుగా రైతు ఖాతాలో జమవుతుందని చెప్పారు. అలాగే ప్రైవేట్ వ్యాపారులు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తూ మోసాలకు పాల్పడినట్లు గుర్తిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏవో నీతిరెడ్డి, పీఏసీఎస్ సీఈవో రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు నవీన్ రెడ్డి, వెంకటస్వామి, రాములు, మస్కూరి బంగారయ్య, హనుమంత్ రెడ్డి, రఘుమారెడ్డి, తిరుపతయ్య, రామన్ గౌడ్, అవంతి శంకర్, వెంకటేష్ గౌడ్ పాషా, రామకృష్ణ, నరేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఆయన నివాసానికి చేరుకోగా పోతురాజు సోమనాద్రి 5 సార్లు ఎమ్మెల్యేగా పనిచేసి సాదాసీదాగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్యను శాలువా పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు కొన్నేళ్ల కిందటి రాజకీయ వ్యవహారాలు ప్రభుత్వాలా పనితీరు అవలంబిస్తున్న విధానాలు అలాగే గ్రామ అభివృద్ధి కోసం యువత రాజకీయాల నేపథ్యం ప్రజల్లో విశ్వాసం చూరగొనే తీరుపై మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతురాజు సోమనాద్రితో సరదాగా చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరా చార్యుల ఉత్సవ మూర్తి విగ్రహం ఊరేగింపు

నారాయణపేట టౌన్, మే1 ప్రభాతవార్త: ఆదిశంకరా చార్యుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శృంగేరి విధు శేఖర భారతి మహా స్వాములవారు బహుకరించిన ఆదిశంకరా చార్యుల ఉత్సవ మూర్తి విగ్రహానికి గురువారం పట్టణంలోని లక్ష్మి గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పళ్ళ దీక్షిత్ స్వగృహం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా అర్చకులు విద్యాధర్ ధరణి ధర్ దీక్షత్ మాట్లాడుతూ శుక్రవారం మూలహనుమాన్ దేవాలయం సమీపంలో గల బాస్కరదేవుజీ నిలయంలో ఆదిశంకర చార్యుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఉదయంపల్లకి సేవా, మహాఅభిషేకం పూజలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో దీరజ్, మహేష్, దేవుజీ కాశినాథ్ శాస్త్రి,రామ్మోహన్ రావ్, కుంభన్న దీక్షిత్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుకకు వేలం

ఖిల్లాగణపురం, మే1 ప్రభాతవార్త:మండల పరిధిలోని మల్కిమియాన్ పల్లి గ్రామ శివారు పిల్లివాగు పరిధిలో ఏప్రిల్ 21న అక్రమంగా నిల్వచేసిన ఇసుకను గుర్తించి స్థానిక తాసిల్దార్ సుగుణ డిప్యూటీ తాసిల్దారు లక్ష్మికాంత్,ఆర్ఐ తిరుపతయ్య ఎస్సై సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో సీజ్ చేయడం జరిగిందని ఇట్టి ఇసుకను క్యూబిక్ మీటర్కు 600 చొప్పున ట్రాక్టర్కు రూ. 1800 అక్రమంగా నిలువచేసిన ఇసుక105 ట్రిప్పులను ఈనెలఏడవ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వేలంపాట వేయనున్నట్టు తహసీల్దార్ సుగుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొన దలచినవారు ఉదయం 11 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

ప్రపంచ కార్మిక సెలవు దినం నారాయణపేటకు వర్తించదా..?!

◆ టియుసిఐ జిల్లా నాయకులు కె.కాశీనాథ్

మేడే రోజు విధుల్లో ఉన్న కార్మికులు

నారాయణపేట టౌన్, మే 1 ప్రభాతవార్త: మే 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా మేడే ప్రపంచ కార్మిక దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులకు ఈరోజు సెలవు ఉంటుంది. కానీ నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్మికులు కొత్త బస్టాండ్ దగ్గర రోడ్డు డివైడర్ కు మొక్కల కటింగ్ చేసే పనిలో ఉన్నారు. మేడే లేబర్ దినం రోజు కార్మికులకు సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించినప్పుడు, ప్రపంచ కార్మిక దినోత్సవం రోజు ప్రపంచ వ్యాప్తంగా కార్మికులకు సెలవు, ఇది నారాయణపేట మున్సిపల్ కార్మికులకు వర్తించదా...! దానిని కూడా ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ కమిషనర్ ఉల్లంఘించి, మున్సిపల్ కార్మికులను విధుల్లో పెట్టడం ప్రభుత్వ అధికారులకుతగునా కార్మికుల సంక్షేమం చూసే లేబర్ డిపార్ట్మెంట్ కూడా నారాయణపేట జిల్లాలో ఆచూకీ లేకుండా పోయింది. పేరుకు మాత్రమే జిల్లా ఆఫీసును నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. లేబర్ ఆఫీస్‌కి వెళ్లే కార్మికులు అధికారులు లేక నిరాశతో వెను తిరిగిన రోజులెన్నో ఉన్నాయి. ఉన్న ఒక్క ఆఫీసరు చిరాకుతో కార్మికులకు సమాధానం చెప్పే పరిస్థితి ఉన్నది. కొత్త జిల్లాలు ఏర్పాటు అయిన ఇన్చార్జి అధికారులు దర్శనమిస్తారు. కార్మికులకు ఉన్న చట్టాలు అమలు చేయడంలో ప్రభుత్వం ,అధికారులు చాల నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్మిక చట్టాలను సమగ్రంగా అమలు చేయాలి. కనీసం వాళ్లకు దక్కాల్సిన హక్కులు, స్వేచ్ఛ దొరికే అవకాశం ఉంటది. చట్టాలను ఉల్లంఘించే అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో టియుసిఐ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కుల గణనతో రాబోయే రోజుల్లో బీసీలకు రాజ్యాధికారం

ఖిల్లా గణపురం, మే1 ప్రభాతవార్త: కుల గణన చేపట్టడంతో రాబోయే రోజుల్లో బీసీలు రాజ్యాధికారం చేపడతారని ఓబీసీ బిజెపి జిల్లా కార్యదర్శి బెన్నూరి ఆశన్న అన్నారు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కులగన చేర్చడం హర్షించదగిన విషయమని అన్నారు. స్వతంత్రం వచ్చిన తర్వాత కేంద్రంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా కూడా ఎప్పుడు కులగణన విషయం మాట ఎత్తలేదని కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం జన గణనతో పాటు కులగనన చేయడం వల్ల బీసీ సామాజిక వర్గంలో అన్ని కులాల వారికి సామాజిక ఆర్థికతో పాటు రాజకీయ విద్య విలువను కూడా పెరుగుతాయని భావిస్తున్నామన్నారు. ఈ నిర్ణయం పుట్ల కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో బీసీలకు అధికారం వచ్చే అవకాశం ఉందని మోదీ ఈ నిర్ణయం పలు సామాజిక వర్గాలు రాజకీయాల్లో అభివృద్ధిలో ముందుంటారని భావిస్తున్నామని చెప్పారు. తొందరలోనే కులగణనను కేబినెట్ ఆమోదించాలని ఆయన పేర్కొన్నారు.

మేడే జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

శ్రమను గౌరవిద్దాం : మాజీ మంత్రి,బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు సి. లక్ష్మారెడ్డి

జడ్చర్ల, మే 1 ప్రభాతవార్త: శ్రామికుల శ్రమను గౌరవిద్దామని శ్రమను గుర్తిద్దామని మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మారెడ్డి అన్నారు.ప్రపంచ కార్మిక కర్షక దినోత్సవం సందర్భంగా మేడేను పురస్కరించుకుని జడ్చర్ల మార్కెట్ యార్డులో బిఆర్ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం పిఆర్టియు ఆధ్వర్యంలో ఏర్పాటు పిఆర్టియు జెండాను మాజీ మంత్రి డా.సిలక్ష్మారెడ్డి ఎగురవేశారు.ఈ సందర్భంగా ప్రజలందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయ ఉద్యోగుల నుండి ఫ్యాక్టరీ కార్మికుల వరకు,ఉపాధ్యాయుల నుండి ట్రక్ డ్రైవర్ల వరకు అన్ని రంగాలలోని ప్రజల కృషి, అంకితభావాన్ని గుర్తించే రోజు మేడే అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, సర్పంచ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, నాయకులు పిట్టల మురళి, బికేఆర్,ఇమ్ము, శ్రీకాంత్, కార్మిక సంఘం నాయకులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొల్లాపూర్‌లో రంగినేని జగదీశ్వర్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొల్లాపూర్/చిన్నంబావి మే 1 ప్రభాతవార్త: ప్రపంచవ్యాప్తంగా కష్టజీవులు జరుపుకునే గొప్ప పండుగ "మే"డే అని కార్మికులు హక్కులు సాధించుకున్న రోజుగా మేడేను నిర్వహించడం జరుగుతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఇందిరాగాంధీ అభిమాన సంఘం నాయకులు గంగినేని జగదీశ్వరుడు అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యా నిలయంలో మేడే సందర్భంగా ప్రసంగిస్తూ నేడు దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమలలో శ్రమిస్తున్న కార్మికులకు, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఉద్యోగ భద్రత కల్పించి ఎనిమిది గంటల పని కల్పించాలని ఉపాధి హామీలో భత్యాన్ని పెంచాలని పింఛన్ సౌకర్యం ఉద్యోగస్తులకు కల్పించాలని నిత్యవసరాలు, గృహ వసతి కార్మికులకు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ద్వారా డిమాండ్ చేశారు. కేంద్రంలో గల ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు మేలు చేసే విధంగా కాకుండా కష్టజీవులకు, కార్మికులకు మేలు కలిగేవిధానాలు అవలంబించాలని రంగినేని జగదీశ్వరుడు కోరారు. అనంతరం కార్మికులను, శ్రామికులను పూలమాలలు శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గోవింద్ గౌడ్, న్యాయవాది మధుసూదన్, రజక స్వామి, జమీల్ అహ్మద్ ఖాన్ ,సురేష్ ,రమేష్,జుబేర్ ఖాన్, జావేద్ ఖాన్, కాంతారావు, రాము యాదవ్, పాల్గొన్నారు.చిన్నంబావిలో మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా సిపీఎం పార్టీ ఆధ్వర్యంలో మరియు సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చిన్నంబావి మండలం మియాపూర్,అమ్మాయి పల్లి ,దగడపల్లి, పెద్ద దగడ, చిన్నంబావి, పెద్దమారూరు, కొప్పునూరు, గూడెం గ్రామాలలో ఘనంగా మేడే ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది. చిన్నంబావి మండల కేంద్రంలో సిఐటియు జెండాను సుజాత ఆవిష్కరించారు. పెద్ద దగడలోసిఐటియు జెండాను కురుమయ్య ఆవిష్కరించారు. మియాపూర్ గ్రామంలో సిపిఎం పార్టీ జెండాను సిపిఎం మండల నాయకులు రాజేంద్ర గౌడ్ ఆవిష్కరించారు. అమ్మాయి పల్లి గ్రామంలో ఆ గ్రామ కార్యదర్శి కురుమయ్య ఆవిష్కరించారు. దగడపల్లి గ్రామంలో పార్టీ జెండాను శాఖ కార్యదర్శి జి.వెంకట స్వామి ఆవిష్కరించారు. చిన్నంబావి మండల కేంద్రంలో పార్టీ జెండాను మండల కార్యదర్శి వెంకటేష్ ఆవిష్కరించారు. పెద్ద మారూరు గ్రామ ఉపాధి పని ప్రదేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు సంఘం జెండాను ఆవిష్కరించారు. కొప్పునూరుగ్రామంలో సిఐటియు జెండాను బాబు యాదవ్ ఆవిష్కరించారు. గూడెం గ్రామంలో సిపిఎం పార్టీ జెండాను శాఖ కార్యదర్శి ఎం.వెంకటయ్య ఆవిష్కరించారు. పలు గ్రామాలలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం తప్పదని వారు మాట్లాడారు.కార్యక్రమంలోపలు గ్రామాల్లో హమాలీ సంఘం,ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ సంఘం, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

మక్తల్ టౌన్, మే 1 ప్రభాతవార్త: 139వ మేడే ను కార్మిక అమరవీరుల ఆశయాల సాధన లో భాగంగా కార్మిక హక్కులను సాధించే దిశలో మేడే జరుపుకోవాలని టి యు సి ఐ కార్మిక వర్గానికి పిలుపు స్థానిక మున్సిపాలిటి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మున్సిపాలిటీ దగ్గర ఉన్న టియుసిఐ జెండాను టియుసిఐ జిల్లా అధ్యక్షులు కిరణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశన్న నరసింహ శంకరమ్మ మహేశ్వరమ్మ రాయకోడ అంజి కొలిమి హరి ఆకాష్ నరసింహ సుజాత తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్, మే 1 ప్రభాతవార్త: కష్టాన్ని నమ్ముకొని కార్మికులు, శ్రామికులు తమ హక్కుల కోసం ఏకమై రక్తం చిందించి, సాదించుకున్న రోజు మేడే అని సిఐటియు జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్, ఏఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మాడ ెమోని ఆంజనేయులు, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాజాపూర్ మండల అధ్యక్షులు జనిగెల శేఖర్ అన్నారు. మేడేను పురస్కరించుకొని గురువారం ఉదయం రాజాపూర్ ముఖ్య కూడలిలో పిఆర్టీయు జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మిక, కర్షక సోదరులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేస్తూ పలువురికి పండ్లు పంపిణీ చేశారు.

ఘనంగా "మే" డే

భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులుఅర్పించి సబ్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచందర్ నాయక్, డివిజన్ అధ్యక్షులు కత్తి విజయ భాస్కర్, జయశంకర్, దేవేందర్, నర్సి రెడ్డి, కళ్యాణ్, రఘు నందన్‌స్వామి, నాగేందర్,వెల్దండ సెక్షన్ లక్ష్కర్, మాధవులు,యాదయ్య, లక్ష్మణ్‌నాయక్, విక్రంరెడ్డి, సాంబశివుడు, మల్లేష్, కృష్ణారెడ్డి, రవీందర్, నగేష్, యాదగిరి ఉన్నారు.

వెల్దండ మే 1 ప్రభాతవార్త: వెల్దండ మండల కేంద్రంలో కార్మికులు మేడే దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, 1104 సిఐటియు ఐఎన్ టియుసి ఆధ్వర్యంలో ఐడియా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 1104 యూని యన్ వెల్దండసెక్షన్ అధ్యక్షులు బంగారి ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికులు

అత్మకూర్, మే 1 ప్రభాతవార్త : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంతో పాటుగా మండలంలోని వివిధ గ్రామాలలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మేడే దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు జిల్లా అధ్యక్షులు మహమూద్ జెండాను ఎగురవేసి మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమరచింత, మే1 ప్రభాతవార్త: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, ఆర్ఎన్ రమేష్,ఏఐటియుసి జిల్లా నాయకులు శ్యాం సుందర్, టియుసిఐ జిల్లా కోశాధికారి సిరాజు కార్మికులకు పిలుపు నిచ్చారు. మేడే దినోత్సవం సందర్భంగా అమరచింత మున్సిపల్ కేంద్రంలోని ఆయా వార్డులలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేష్, జిఎస్ గోపి, అజయ్, బుచ్చన్న, ఏఐటియుసి నాయకులు అబ్రహం, భాస్కర్, రవీందర్, కుతుబ్, టియుసిఐ నాయకులు సామేలు, కె.రాజన్న, ప్రేమరత్నం, భక్తి, జిలాని, కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల ప్రతినిధి, మే 1 ప్రభాతవార్త: జిల్లా కేంద్రంలోని కార్మికుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల యొక్క చట్టాల గురించి వివరించారు. కార్మికులందరూ లేబర్ కార్డు, ఇస్రం కార్డు ప్రతి ఒక్క కార్మికుడు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్డుల వల్ల ప్రభుత్వంయొక్కసదుపాయాలని వినియోగించుకోవచ్చు అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని మీసేవ కేంద్రం ఉపయోగించుకోవాలన్నారు. వారి యొక్క సమస్యలను దరఖాస్తు రూపంలో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సుకు అందచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాల్, మోయిన్‌పాషా అడ్వకేట్లు వి.రాజేందర్, బి.శ్రీనివాసులు, లక్ష్మణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉట్కూరు, మే 1 ప్రభాతవార్త: 139వ మే డే సందర్భంగా ఉట్కూరు మండల కేంద్రంలో గురువారం బస్టాండ్ సెంటర్లో మేడే జెండాను టియుసిఐ ఉట్కూరు భవన నిర్మాణ తాపీ మేస్త్రీల కార్మిక సంఘం అధ్యక్షులు కూతలి నాగేష్ జెండాను ఆవిష్కరించారు అనంతరం శివాలయం నుండి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ బస్టాండ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు ఈ ప్రగతిశీల భవన నిర్మాణకార్మిక సంగం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కోటి చిన్నప్ప ముఖ్యవక్తగా ఏఐపీకే ఎంఎ సలీం హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ 139 సంవత్సరాల క్రితం చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం సాధించుకున్న రోజుగాసంఘం ఉపాధ్యక్షులు బాలప్ప కార్యదర్శి కృష్ణయ్య, మేస్త్రి అంజనేయులు, శ్రీనివాస్ బాలరాజు, సహాయ కార్యదర్శి లింగప్ప,మాజీ అధ్యక్షులు నారాయణ కార్మికులు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా..

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మే1 ప్రభాతవార్త: పదవ తరగతి ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేయడంతో నారాయణపేట జిల్లా విద్యార్థినీ విద్యార్థులను గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సర కాలంలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులతో పాటువారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో నిత్యం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఫెయిల్

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

అయిన విద్యార్థులుఎలా ఫెయిల్ కావడం జరిగిందో విశ్లేషించుకోవాలన్నారు. ప్రతివారం సబ్జెక్టుల వారిగా పరీక్షించుకోవాలన్నారు. డిసెంబర్ నుండి పరీక్షలు అయ్యేవరకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ స్వంత పిల్లలుగా చూసుకుంటూ నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినీ, విద్యార్థులతో అభినందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ,విద్యాశాఖ అధికారి, గోవిందరజ్, మైనారిటీ అధికారి రషీద్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు,హెడమాష్టర్లు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆణిముత్యం అక్షయను అభినందించిన ఎమ్మెల్యే

గద్వాల ప్రతినిధి,మే 1 ప్రభాతవార్త: గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్షయ పదవతరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 566 సాధించి జిల్లాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అక్షయకు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువా కప్పి పూల బొకేతో సన్మానించి, స్వీట్స్ తినిపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఎటువంటి కార్పొరేట్ పాఠశాలకుతక్కువ కాదనిఅక్షయ నిరూపించిందన్నారు. గద్వాలతో పాటు తల్లిదండ్రులకు ఉధ్యాయులకు గౌరవాన్ని తెచ్చిపెట్టిందని, ఇలాగే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జహురుద్దీన్‌కి ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందిని అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే